సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 3 । డిసెంబర్ । 2023



కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తయ్యాయని చేవెళ్ల ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరాం తెలిపారు. 8లో▸



కౌన్ బనేగా..

చేవెళ్ల శాసనసభ్యుడు ఎవరో తేలే తరుణం రానేవచ్చింది. మరికొద్ది గంటల్లో ఫలితం వెలువడనుంది. 8లో▸



కల్వకుర్తి కింగ్ ఎవరో?

కల్వకుర్తి నియోజకవర్గంలో విజయం ఎవరిని వరిస్తుందోనని అభ్యర్థులతో పాటు ప్రజలు కుతూహలంగా ఉన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

పౌర సరఫరాల సంస్థ గోదాం తనిఖీ



ఆమనగల్లులో గోదామును తనిఖీ చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్

ఆమనగల్లు: పౌర సరఫరాల శాఖ గోదాము నిర్వహణలో అవకతవకలకు పాల్పడినా, ఉదాసీనంగా వ్యవహరించినా చర్యలు తప్పవని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ హెచ్చరించారు. ఆమనగల్లు పట్టణంలోని పౌరసరఫరాల శాఖ గోదామును శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో స్టాకు, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. రేషన్ షాపులకు సకాలంలో సరుకులను రవాణా చేయాలని అన్నారు. రేషన్‌బియ్యం తమకు ఇంకా పంపలేదని డీలర్లు ఫిర్యాదు చేయకుండా సకాలంలో వారికి పంపించాలని గోదాము ఇన్‌చార్జికి సూచించారు. ఎఫ్‌సీఐ నుంచి వస్తున్న బియ్యం స్టాకు తూకంలో అనుమానాలుంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలన్నారు. రేషన్ షాపులకు పంపించే బియ్యాన్ని తప్పనిసరిగా తూకంవేయాలని, తూకం వేయకుండా పంపిస్తే చర్యలు తీసుకుంటామని గోదాము సిబ్బందిని ఆయన హెచ్చరించారు. సకాలంలో ప్రజలకు రేషన్ సరుకులను అందించాలని కోరారు.

కౌంటింగ్ కేంద్రం పరిశీలన



ఇబ్రహీంపట్నం కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాచకొండ సీపీ దేవేంద్రసింగ్ చౌహాన్

ఇబ్రహీంపట్నం రూరల్: మంగళ్‌పల్లి సమీపంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని శనివారం రాచకొండ పోలీస్ కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ మహేశ్వరం జోన్ డీసీపీ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. అధికారుల తో మాట్లాడి ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ జరిగేలా చూడాలని అన్నారు. ఏజెంట్లు, పోలీసులు, అధికారులకు ప్రత్యేక ప్రవేశం కల్పించడం జరిగిందన్నారు.ప్రతి కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే లా అందరూ సహకరించాలని కోరారు.

ఇక ఎల్‌ఐసీ ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్

సాక్షి, సిటీబ్యూరో: ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్ పేరు మారింది. ఇక నుంచి ఈ స్టేషన్‌ను ఎల్ఐసీ ఎంజీబీఎస్ మెట్రోస్టేషన్‌గా పరిగణిస్తారు. ఈ మేరకు హైదరాబాద్ మెట్రో రైల్ ఇప్పటికే స్టేషన్ అనౌన్స్‌మెంట్‌లో మార్పు చేసింది. ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్‌కు ముందు ఎల్‌ఐసీ అనే పదాన్ని చేరుస్తూ స్టేషన్‌లో ప్రత్యేక బోర్డులను ఏర్పాటు చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్న వ్యాపార సంస్థల పేర్లను ఆయా స్టేషన్లకు ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రకాశ్‌నగర్, హైటెక్‌సిటీ, రాయదుర్గం తదితర స్టేషన్ల పేర్లను ఇప్పటికే మార్చారు. తాజాగా ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్‌కు ఎల్‌ఐసీ కొత్తగా వచ్చి చేరింది.

రూ.70లక్షలు గోల్‌మాల్ ?

అభ్యర్థి పరేషాన్

రాంగోపాల్‌పేట్: ఎన్నికలు పూర్తయ్యాయి అభ్యర్థుల జాతకాలు కొద్ది గంటల్లో తేలనున్నాయి. కానీ ఎన్నికల్లో గెలవాలనే ఉద్దేశంతో ఖర్చు విషయమై ఎవరూ ఆలోచించలేదు. ఎక్కడ ఎవరు ఎంత కావాలంటే అంత, అడిగినంత పంచేశారు. ఇదే అదనుగా కొందరు ద్వితీయ శ్రేణి నాయకులు అభ్యర్థులు చేతివాటం ప్రదర్శించారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి ఓ ద్వితీయ శ్రేణి నాయకుడిని నమ్మి రూ.2 కోట్లు అప్పగించింది. అయితే అతను అభ్యర్థి చెప్పిన వారందరికీ డబ్బులు పంచినట్లు చెప్పాడు. కానీ ఇంకా రూ.70 లక్షలు మాత్రం లెక్క తేలలేదు. ఎన్నికలు పూర్తయ్యాక సదరు అభ్యర్థి లెక్కలు అడిగితే పోలీసులు వచ్చారు, ఆ డబ్బును ఎక్కడో పడేశాను అని సమాధానం ఇచ్చాడు. దీంతో డబ్బు తెచ్చి ఇవ్వాలని అభ్యర్థి ఒత్తిడి చేయడంతో సదరు నాయకుడు తనకు ఒంట్లో బాగో లేదని వచ్చి చెబుతానని సమాధానం చెప్పడం గమనార్హం.

ఉత్కంఠ పోరు ఎవరిదో జోరు

నేడు ఓటరు తీర్పు

- తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- సరూర్‌నగర్ స్టేడియం, గచ్చిబౌలి స్టేడియం, సీవీఆర్ కాలేజీ, లార్డ్స్ కాలేజీలో లెక్కింపు కేంద్రాలు
- 8 నియోజకవర్గాలు.. 213 టేబుళ్లు
- కౌంటింగ్‌కు పూర్తయిన ఏర్పాట్లు
- తొలుత చేవెళ్ల, చివరగా శేరిలింగంపల్లి ఫలితం
- జడ్జిమెంట్‌పై సర్వత్రా ఉత్కంఠ



సీవీఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జడ్జిమెంట్ డేకు రంగం సిద్ధమైంది.. తుది తీర్పు కోసం అటు అభ్యర్థులు.. ఇటు ఆయా పార్టీల శ్రేణులు.. ప్రజలు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. ఈవీఎంల కంట్రోల్ యూనిట్లలో నిక్షిప్తమైన ఓట్లు ఎవరికి అధికారం కట్టబెడతాయోననే టెన్షన్ సర్వత్రా నెలకొంది. సరూర్‌నగర్ ఇండోర్‌స్టేడియంలో ఎల్బీనగర్.. గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియంలో శేరిలింగంపల్లి.. మంగల్‌పల్లి సమీపంలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి.. అప్పాజంక్షన్ సమీపంలోని లార్డ్స్ ఇంజనీరింగ్ కాలేజీలో రాజేంద్రనగర్, షాద్‌నగర్, చేవెళ్ల నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్లను లెక్కించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులు, పోలింగ్ కేంద్రాల నిష్పత్తి మేరకు ఆయా కేంద్రాల్లో మొత్తం 213 టేబుళ్లు ఏర్పాటు చేశారు. తొలి ఫలితం చేవెళ్ల నుంచి, తుది ఫలితం శేరిలింగంపల్లి నుంచి వెలువడే అవకాశం ఉంది.

వీవీ ప్యాట్ స్లిప్పులే ప్రామాణికం

కంట్రోల్ యూనిట్లపై ఉన్న అనుమానాలను తొలగించడానికి ఆయా నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన వీవీప్యాట్ స్లిప్పులను లెక్కించాల్సి ఉంది. ర్యాండమైజేషన్ పద్ధతి ద్వారా వీవీ ప్యాట్లను ఎంపిక చేస్తారు. కంట్రోల్ యూనిట్లకు సంబంధించి చివరి రౌండ్ పూర్తయ్యాకే వీవీప్యాట్ స్లిప్పులను లెక్కిస్తారు. అభ్యర్థుల గుర్తుల వారీగా పెట్టెలను ఏర్పాటు చేసి వారికి వచ్చిన ఓట్లను వాటిలో వేస్తారు. అనంతరం లెక్కిస్తారు. ఒక వేళ ఈవీఎం కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్ స్లిప్పుల లెక్కలకు తేడా వస్తే ఆ స్లిప్పులను మరో సారి లెక్కిస్తారు. అలా రెండు, మూడు సార్లు లెక్కించినా తేడా వస్తే మాత్రం వీవీ ప్యాట్ స్లిప్పులనే పరిగణలోకి తీసుకుని ఫలితాలు వెల్లడిస్తారు.

రౌండ్ల వారీగా..

సాధారణంగా ఒక్కో నియోజకవర్గానికి 14 టేబుళ్లను ఏర్పాటు చేస్తారు. ఎల్బీనగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లిలో అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండటం, ఒక్కో పోలింగ్ బూత్‌లో రెండు చొప్పున ఈవీఎంలను ఏర్పాటు చేయడంతో ఆయా నియోజకవర్గాల లెక్కింపు కేంద్రాల్లో మాత్రం 28 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల సంఖ్యను బట్టి లెక్కింపు రౌండ్లను నిర్ణయిస్తారు. పోలింగ్ కేంద్రాల క్రమసంఖ్య ఆధారంగా ఒక్కో టేబుల్‌కు ఒక్కో కంట్రోల్ యూనిట్‌ను కేటాయిస్తారు. ఇలా టేబుళ్ల సంఖ్యకు అనుగుణంగా కంట్రోల్ యూనిట్లను ఉంచి ఓట్లను లెక్కించనున్నారు. సూపర్‌వైజర్ కంట్రోల్ యూనిట్‌పై ఉండే రిజల్ట్ బటన్ నొక్కిన వెంటనే ఏ పార్టీ అభ్యర్థికి ఎన్ని ఓట్లు పోలయ్యానే విషయం తెలిసిపోతోంది. టేబుళ్లపై ఉన్న కంట్రోల్ యూనిట్లలోని ఓట్ల లెక్కింపు పూర్తయితే.. దానిని ఒక రౌండ్‌గా భావిస్తారు. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి కనీసం 30 నిమిషాలు పడుతుంది. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన కంట్రోల్ యూనిట్లలో ఓట్లను లెక్కించే వరకు రౌండ్ల వారీగా ఈ ప్రక్రియ కొనసాగుతుంది. కౌంటింగ్ అధికారులు, అభ్యర్థుల తరఫున వచ్చిన ఏజెంట్ల సమక్షంలో ఈ తంతు జరుగుతుంది. దీనిని అదనపు రిటర్నింగ్ అధికారి పర్యవేక్షిస్తుంటారు.

రిటర్నింగ్ అధికారి ద్వారా ధ్రువీకరణ పత్రం

నియోజకవర్గంలోని మొత్తం పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన కంట్రోల్ యూనిట్లలోని ఓట్ల లెక్కించిన తర్వాత గెలుపొందిన పార్టీ, అభ్యర్థిని కౌంటింగ్ సూపర్‌వైజర్ నిర్ధారించాల్సి ఉంది. అనంతరం రిటర్నింగ్ అధికారి సదరు అభ్యర్థికి ధ్రువపత్రం అందజేస్తారు. ఇక్కడితో ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుంది.

మొరాయించినవి చివరికే..

ఓట్ల లెక్కింపు సందర్భంగా కంట్రోల్ యూనిట్ల బ్యాటరీలు పని చేయకున్నా.. ఒకవేళ మొరాయించినా పక్కన పెట్టేస్తారు. మిగితా కంట్రోల్ యూనిట్లలో ఓట్లను లెక్కిస్తారు. అనంతరం ఎన్నికల సంఘం అనుమతితో మొరాయించిన వాటికి సంబంధించిన వీవీ ప్యాట్ స్లిప్పులను లెక్కిస్తారు.

ఒక్కో టేబుల్‌కు ముగ్గురు

నియోజకవర్గానికో రిటర్నింగ్ అధికారి, అదనపు రిటర్నింగ్ అధికారితో పాటు లెక్కింపు కోసం ఏర్పాటు చేసిన14 టేబుళ్లకు అనుగుణంగా ఒక్కో టేబుల్‌కు ముగ్గురు చొప్పున అధికారులను ఎన్నికల సంఘం నియమించింది. వీరి సమక్షంలో లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుంది. ఇందులో సూక్ష్మపరిశీలకుడు, కౌంటింగ్ సూపర్ వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్ ఉంటారు. వీరితో పాటు కంట్రోల్ యూనిట్లను టేబుల్‌పైకి తీసుకు రావడానికి ఒక క్యారీమెన్ సేవలందిస్తారు. ఈ ప్రక్రియ సరిగ్గా జరుగుతుందా? లేదా అని సూక్ష్మ పరిశీలకుడు పరిశీలిస్తారు. రౌండ్ల వారీగా అభ్యర్థులకు వచ్చిన ఓట్లను కౌంటింగ్ అసిస్టెంట్ నమోదు చేస్తారు. లెక్కింపు టేబుల్ చుట్టూ ఒక్కో అభ్యర్థి నుంచి ఒక ఏజెంట్ చొప్పున ఉంటారు. మొత్తం 213 టేబుళ్లకు 900 మంది సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు.

పోస్టల్ బ్యాలెట్లతో మొదలు

ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో లెక్కింపు ప్రారంభమవుతుంది. అరగంటలో ముగుస్తుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్లు, తర్వాత సర్వీసు ఓట్లను లెక్కించాల్సి ఉంది. నిర్ణీత వ్యవధిలో పూర్తికాకపోయినా 8.30 గంటలకు ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించొచ్చు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు పూర్తయితే కానీ ఈవీఎంల రౌండ్ల ఫలితాలను అధికారికంగా ప్రకటించడానికి వీల్లేదు. సంబంధిత రిటర్నింగ్ ఆఫీసర్ పర్యవేక్షణలోనే పోస్టల్ బ్యాలెట్లు లెక్కిస్తారు. ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపు టేబుళ్లకు అదనంగా పోస్టల్ బ్యాలెట్ల కోసం ఆర్‌ఓ వద్ద ప్రత్యేక టేబుళ్లు వేశారు.

నియోజకవర్గాల వారీగా..

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పోలైన ఓట్లు	అభ్యర్థులు	టేబుల్స్	పోస్టల్ బ్యాలెట్	సిబ్బంది
ఇబ్రహీంపట్నం	343	2,45,459	28	14	5	84
ఎల్బీనగర్	573	2,91,347	48	28	7	144
మహేశ్వరం	542	3,02,762	27	28	5	137
రాజేంద్రనగర్	542	3,24,917	25	28	7	144
శేరిలింగంపల్లి	638	3,57,074	31	28	7	144
చేవెళ్ల	298	1,94,343	12	14	6	83
కల్వకుర్తి	262	2,01,285	24	14	6	83
షాద్‌నగర్	255	1,94,017	14	12	5	81
మొత్తం	3,453	21,11,204	209	166	47	900

46.58 లక్షల మంది ఓటేయలే..

సాక్షి,సిటీబ్యూరో: గ్రేటర్‌లో సగానికి పైగా సిటీజనులు ఓటుహక్కు వినియోగించడంలో నిర్లిప్తత ప్రదర్శించారు. సుమారు 46.58 లక్షల మంది ఓటు హక్కు వినియోగించుకునేందుకు దూరంగా ఉన్నారు. మహా నగరంలోని హైదరాబాద్-రంగారెడ్డి-మేడ్చల్ జిల్లా పరిధిలోని 24 అర్బన్ అసెంబ్లీ సెగ్మెంట్లలో జనాభా సుమారు కోటి 20 లక్షలపైనే ఉండగా, అందులో 95.69 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. రెండురోజుల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో కేవలం 49.11లక్షల మంది మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల కమిషనర్ అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మిగతా వారు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆసక్తి కనబర్చలేదు.

అలరించిన 'నాట్యానుభవ' ప్రదర్శన

సాక్షి, సిటీబ్యూరో: నాట్య మయూర కూచిపూడి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో రవీంద్రభారతి వేదికగా శనివారం నిర్వహించిన నాట్యానుభవ 2023 ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. అకాడమీ 6వ వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాట్యాచార్య మద్దాలి సౌందర్య కౌశిక్ ఆధ్వర్యంలోని 40 మంది శిష్యులు పాల్గొని సంప్రదాయ కూచిపూడి శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, పద్మశ్రీ డా.జి.పద్మజారెడ్డి, ఆంధ్ర నాట్య విద్వాంసులు కళాకృష్ణ, కేంద్ర సంగీత నాటక అకాడమీ ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ అవార్డు గ్రహీత ప్రొ.వసంత్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నగర సీపీకి అభినందనలు

హిమాయత్‌నగర్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసిన సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్యకు పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు అభినందనలు తెలియజేశారు. శనివారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్(సీసీసీ)లో సీపీని కలిసిన వారు బొకే అందజేసి నగర పోలీసు సిబ్బంది తరఫున అభినందించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు నల్లా శంకర్ రెడ్డి, సంఘం సభ్యులు విక్టర్, నవీన్ కుమార్, జనార్దన్ రెడ్డి, శాంతి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

కాయ్ రాజా కాయ్

- ఎవరు గెలుస్తారు? ఎంత మెజారిటీ?
- రంగంలోకి బెట్టింగ్ రాయుళ్లు
- ఫాంహౌస్‌లు, రిసార్ట్‌లలో ఏర్పాట్లు
- ప్రత్యేక పోలీసు బృందాల నిఘా



సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో బెట్టింగ్ రాయుళ్లు రంగంలోకి దిగారు. శివారు ప్రాంతాల్లోని ఫాంహౌస్‌లు, రిసార్ట్‌లలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటల నుంచే కౌంటింగ్ ప్రారంభం కావడంతో పందెం రాయుళ్లు కూడా సిద్ధమయ్యారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక వంటి సరిహద్దు రాష్ట్రాల్లోని పందెం రాయుళ్లు కూడా తెలంగాణ ఫలితాలపై ఆసక్తి కనబరుస్తున్నారు. అభ్యర్థుల గెలుపోటములపై బేరీజు వేస్తూ పందేలు వేయడమే కాదు.. ఎవరు ఎంత మెజారిటీతో గెలుస్తారు? డిపాజిట్ల గల్లంతు, తొలిసారి విజయావకాశాలు వంటి అన్ని కోణాల్లో పందేలు కాస్తున్నారు. గట్టి పోటీ, బరిలో ప్రముఖులు ఉన్న నియోజకవర్గాలపై ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలిసింది. దీనికితోడు సెంటిమెంట్, సమీకరణాలతో కూడిన సీట్లలో అభ్యర్థుల గెలుపోటములపై బెట్టింగ్ సాగుతోంది. సీటు, ఓటు శాతం, డిపాజిట్ల గల్లంతు, రాష్ట్రంలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు ఇలా ప్రతి అంశాన్ని బెట్టింగ్‌కు వినియోగించుకుంటున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో నాంపల్లి, గోషామహల్ నియోజకవర్గాలలో గెలుపోటములపై కోట్లలో పందేలు జరుగుతున్నట్లు సమాచారం. దీంతో పాటు సీఎం కేసీఆర్, ఈటెల రాజేందర్, రేవంత్‌రెడ్డి తలపడుతున్న గజ్వేల్, కామారెడ్డి నియోజకవర్గాలపై పందేలపై బెట్టింగ్ రాయుళ్లు భారీగా చేస్తున్నారు. ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్ ఉంటుందన్న సమాచారంతో గ్రేటర్ పోలీసులు అప్రమత్తమయ్యారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టారు.

పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలి

- ప్రముఖ పర్యావరణవేత్త, రిటైర్డ్ ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి



సదస్సుకు హాజరైన విద్యార్థులతో పర్యావరణ నిపుణులు, నిర్వాహకులు

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణకు యువత నడుం బిగించాలని ప్రముఖ పర్యావరణవేత్త, రిటైర్డ్ ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి సమీపంలోని ఎర్త్ సెంటర్‌లో కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం 'వాతావరణ భద్రత–యువత పాత్ర' అంశంపై సదస్సు నిర్వహించారు. సదస్సుకు పురుషోత్తంరెడ్డితోపాటు సీజీఆర్ చైర్‌పర్సన్ లీలా లక్ష్మారెడ్డి, పర్యావరణ నిపుణుడు దొంతి నర్సింహారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ.. యువత పర్యావరణ రక్షణకు నాయకత్వం వహిస్తూ, ప్రభుత్వ విధానాల్లో మార్పులు తీసుకువచ్చేందుకు కృషి చేయాలని.. సమాజంలో సుస్థిర అభివృద్ధికి వారధిగా నిలవాలని పిలుపునిచ్చారు. సీజీఆర్ చైర్ పర్సన్ లీలా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ రక్షణతోనే మానవ మనుగడ ఆధారపడి ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములయ్యేందుకు యువత కదిలి రావాలని కోరారు. పర్యావరణ మార్పులు, సుస్థిర అభివృద్ధి తదితర ప్రాధాన్యత అంశాలపై దొంతి నర్సింహారెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీజీఆర్ వ్యవస్థాపకుడు లక్ష్మారెడ్డి, ఎర్త్‌సెంటర్ డైరెక్టర్ డాక్టర్ సాయిభాస్కర్‌రెడ్డి, ఎన్ఆర్ఐ విజయ్ భాస్కర్‌రెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ చైర్మన్ మాధవరెడ్డి, గౌతమిఫౌండేషన్ అధ్యక్షుడు కృష్ణ, అయిష్టర్ సంస్థ అధ్యక్షుడు సునీల్ శింగాడే, పర్యావరణ ప్రచారకర్త సురేశ్, సామాజిక కార్యకర్త రుచిత్ కమల్, వికాస్, వివిధ కళాశాలల ప్రొఫెసర్లు, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జిలు, లీప్ ఎడ్యుకేషన్ సెంటర్స్ నిర్వాహకులు, సీజీఆర్ ప్రతినిధులు, వివిధ కళాశాలల విద్యార్థులు, పర్యావరణ ప్రేమికులు పాల్గొన్నారు.

మూడంచెల భద్రత



- తనిఖీ చేశాకే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతి
- ప్రాంగణంలోనికి వాహనాల ప్రవేశం నిషేధం
- కేంద్రానికి నిర్ణీత పరిధిలో 144వ సెక్షన్
- రెండు కిలోమీటర్ల పరిధిలో ప్రత్యేక గస్తీ

సాక్షి, సిటీబ్యూరో: ఓట్ల కౌంటింగ్ ఆదివారం నగర కమిషనరేట్ పరిధిలోని 15 కేంద్రాల్లో జరగనుంది. ఇందుకోసం పోలీస్ విభాగం చేస్తున్న విస్తృత స్థాయి భద్రత, బందోబస్తు ఏర్పాట్లను శనివారం నగర సీపీ సందీప్ శాండిల్య సమీక్షించారు. అవాంఛనీ ఘటనలకు తావివ్వకుండా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులతో పాటు డీసీపీలను కొత్వాల్ ఆదేశించారు. పోలింగ్ నేపథ్యంలో చెదురుమదురు ఘటనలు జరిగిన ప్రాంతాలతో పాటు సున్నితమైన చోట్ల ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు అదనపు సిబ్బందిని మోహరించాలన్నారు.

ఏర్పాట్లు ఇలా..

బందోబస్తు చర్యల్లో భాగంగా కౌంటిగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నారు. కౌంటింగ్ కేంద్రం లోపల, అతి సమీపంలో ఉండే తొలి అంచెలో కేంద్ర సాయుధ బలగాలకు చెందిన సిబ్బంది ఉంటారు. ఈవీఎంలను స్ట్రాంగ్ రూంల నుంచి కౌంటింగ్ హాల్‌కు తీసుకువచ్చే మార్గమూ వీరి అధీనంలోనే ఉంటుంది. దీంతో పాటు ఇతర బందోబస్తు, రిజర్వ్ అవసరాల కోసం దాదాపు 100 ప్లటూన్ల ఏఆర్ బలగాలను నగర వ్యాప్తంగా మోహరిస్తున్నారు. కౌంటింగ్ ప్రాంగణం, చుట్టుపక్కల ఉండే రెండు, మూడు అంచెల్లో రాష్ట్ర సాయుధ పోలీసులు, నగర బలగాలను మోహరిస్తున్నారు.

క్షుణ్ణంగా తనిఖీ చేశాకే..

విధుల్లో ఉండే సిబ్బంది, ఏజెంట్ల సహా కౌంటింగ్ కేంద్రంలోకి వచ్చే ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే అనుమతించాలని పోలీసులు నిర్ణయించారు. సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, వాకీటాకీలు వంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాలతో పాటు మండే స్వభావమున్న వస్తువులు, రంగులు, పూలదండలు, మంచినీళ్ల బాటిళ్లు తదితరాలు కౌంటింగ్ కేంద్రంలోని తీసుకురావడాన్ని ఎన్నికల సంఘం నిషేధించిన నేపథ్యంలో ఈ ఏర్పాట్లు చేస్తున్నారు. వీలున్న ప్రతిచోటా ప్రవేశ ద్వారాల వద్ద డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు, సిబ్బంది వద్ద హ్యాండ్‌హెల్డ్ మెటల్ డిటెక్టర్లు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. స్థానిక పరిస్థితుల ఆధారంగా కౌంటింగ్ కేంద్రాలకు నిర్ణీత పరిధిలో 144వ సెక్షన్ కూడా విధించారు.

విజయోత్సవ ర్యాలీలు నిషేధం..

నగర వ్యాప్తంగా నిషేధాజ్ఞలు అమలులో ఉన్న నేపథ్యంలో ముందస్తు అనుమతులు లేకుండా కౌంటింగ్ కేంద్రాల నుంచి విజయోత్సవ ర్యాలీలు తీయడం, బాణాసంచా కాల్చడం తదితరాలను నిషేధించారు. ఈ నేపథ్యంలో ప్రాంగణంతో పాటు చుట్టూ రెండు కిలోమీటర్ల పరిధిలో గస్తీ కోసం ప్రత్యేక బృందాల్ని రంగంలోకి దింపుతున్నారు. వీరు పరిమితికి మించిన సంఖ్యలో ఎవరూ గుమిగూడకుండా చర్యలు తీసుకుంటారు. ప్రతి కౌంటింగ్ కేంద్రం వద్దా కనిష్టంగా 200 మంది పోలీసులు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆదివారం ఉదయం 6 నుంచి సోమవారం ఉదయం 6 వరకు నగర వ్యాప్తంగా మద్యం విక్రయాలను నిషేధించారు. కల్లదుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లతో పాటు మిలటరీ క్యాంటీన్లకూ ఇది వర్తించనుంది.

మరిన్ని ప్రత్యేక చర్యలు...

- ప్రతి కౌంటింగ్ కేంద్రం వద్దా ప్రత్యేక కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసి, ఏసీపీ స్థాయి అధికారి ఇన్‌చార్జ్‌గా పెట్టనున్నారు. స్థానిక డీసీపీలు సైతం పర్యవేక్షణ బాధ్యతలు చేపడతారు.
- ప్రాంగణంలో అవసరమైన చోట్ల బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు బయట ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నారు.
- కౌంటింగ్ కేంద్రం ఉన్న ప్రాంతంతో పాటు ప్రతి డివిజన్‌లోనూ కచ్చితంగా పోలీసు పికెట్లు ఏర్పాటు చేయనున్నారు.
- మతపరంగా సున్నితమైన ప్రాంతాల్లో వివాదాస్పద వ్యాఖ్యలు, రెచ్చగొట్టే ప్రసంగాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.
- అభ్యర్థుల మధ్య తీవ్రపోటీ ఉన్న డివిజన్లలో ఉద్రిక్తతలకు ఆస్కారముండే ప్రాంతాల్ని ముందే గుర్తించి సాయుధ పికెట్లు వేస్తున్నారు.
- కౌంటింగ్ కేంద్రాల వద్ద పికెట్లలోనూ విధులు నిర్వహించడానికి సాయుధ బలగాలను వినియోగిస్తున్నారు.
- కౌంటింగ్‌ను పర్యవేక్షించడానికి వచ్చే అధీకృత వ్యక్తులకు ప్రత్యేక పార్కింగ్ ప్రాంతం కేటాయిస్తున్నారు.
- ఎక్కడైనా ట్రాఫిక్ మళ్లింపులు విధిస్తే సోషల్ మీడియాతో పాటు ఇతర మార్గాల్లో విస్తృతంగా ప్రచారం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.
- సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం, ఇబ్రహీంపట్నంలోని సీవీఆర్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లను రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్ పరిశీలించారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- ఉదయం 8 గంటల నుంచి లార్డ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో లెక్కింపు
- 14 టేబుళ్లు, 21 రౌండ్లలో చేవెళ్ల సెగ్మెంట్ ప్రక్రియ
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరాం


సాయిరాం, ఎన్నికల రిటర్నింగ్ అధికారి

చేవెళ్ల: సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాటు పూర్తయ్యాయని చేవెళ్ల ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరాం తెలిపారు. శనివారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని రాజేంద్రనగర్ పరిధి అప్పా సమీపాన ఉన్న లార్డ్స్ ఇంజినీరింగ్ కళాశాల 3వ అంతస్తులో ఆదివారం ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుతో ప్రక్రియ ప్రారంభం కానుందని, 8.30 గంటలకు ఈవీఎంల కౌంటింగ్ మొదలు అవుతుందని వెల్లడించారు. చేవెళ్ల సెగ్మెంట్‌కు సంబంధించి ఓట్లను లెక్కిస్తారని చెప్పారు. నియోజకవర్గంలో మొత్తం 2,62,005 ఓట్లు ఉండగా, నవంబర్ 30న 1,94,343 ఓట్లు (పురుషులు 99,705, మహిళలు 94, 638) పోలయ్యాయని పేర్కొన్నారు. దీంతో ఓటింగ్ శాతం 74.18శాతంగా నమోదైందని తెలిపారు.

నిఘా నీడలో..

నియోజకవర్గంలో మొత్తం 2,086 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదయ్యాయని, వాటిని మొదటగా లెక్కిస్తారని, వీటికోసం 6 టేబుళ్లు కేటాయించినట్లు చెప్పారు. 298 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలను ఇప్పటికే స్ట్రాంగ్ రూంలో భద్రపరిచినట్లు వివరించారు. కౌంటింగ్‌లో అసెంబ్లీకి 14 టేబుళ్లను ఏర్పాటుచేసి, మొత్తం ఓట్లను 21 రౌండ్లలో లెక్కించడానికి సన్నాహాలు చేసినట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియలో 150 మంది సిబ్బంది పాల్గొనున్నారని, లెక్కింపు మొత్తం సీసీ కెమెరాల నిఘాలో జరగనుందని తెలిపారు. కౌంటింగ్ అబ్జర్వర్‌గా సమీక్ష అనే అధికారిని నియమించామన్నారు. సాయంత్రం వరకు కౌంటింగ్ పూర్తి అవుతుందని తెలిపారు.

అభ్యర్థులకు పాస్‌ల జారీ

కౌటింగ్ హాల్‌కు వచ్చే ఏజెంట్లకు పార్టీల వారీగా వారి అభ్యర్థులకు ఒక్కొక్కరికి 20 పాస్‌లను ఇవ్వనున్నామని, అందులో భాగంగా చేవెళ్లలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్‌ఓ ఆధ్వర్యంలో పాస్‌లను జారీ చేసినట్లు తెలిపారు. ఆదివారం ఉదయమే ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రానికి రావాల్సి ఉంటుందన్నారు. ఇదిలా ఉండగా.. లార్డ్స్ కళాశాలలో రాజేంద్రనగర్, షాదర్‌నగర్, చేవెళ్ల నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్లను కౌంటింగ్ చేయనున్నారని తెలిపారు.

కౌన్ బనేగా చేవెళ్ల బాద్‌షా

- మరి కొద్ది గంటల్లో తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- రాజేంద్రనగర్ లార్డ్స్ కళాశాలలో ఓట్ల కౌంటింగ్


కాలె యాదయ్య, బీఆర్ఎస్


పామెన భీంభరత్, కాంగ్రెస్


కేఎస్.రత్నం, బీజేపీ


చేవెళ్ల నియోజకవర్గ ముఖచిత్రం

చేవెళ్ల: చేవెళ్ల శాసనసభ్యుడు ఎవరో తేలే తరుణం రానే వచ్చింది. గత నెల నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోలైన ఓట్లను రాజేంద్రనగర్ పరిధి లార్డ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఉదయం 8గంటలకు లెక్కించనున్నారు. ఈ నేపథ్యంలో చేవెళ్ల బరిలో నిల్చున్న అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. ఈవీఎం ద్వారా లెక్కింపు ప్రక్రియ జరగనుండటంతో మధ్యాహ్నం వరకు ఫలితాలు వెలువడే అవకాశం ఉంది. చేవెళ్ల నియోజకవర్గ స్థానానికి 12 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీరిలో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల మధ్యే పోటీ ఎక్కువగా ఉంది. కాంగ్రెస్ అభ్యర్థిగా పామెన భీంభరత్, బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే కాలె యాదయ్య, బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నంలు బరిలో ఉన్నారు. ఇక బీఎస్పీ నుంచి రాజమహేంద్రవర్మ ఉన్నారు. వీరంతా మూడు వారాలుగా ఒకరికి మించి మరొకరు ఓటర్లను ప్రసన్నం చేసుకున్నప్పటికీ.. వారు ఎవరికి మొగ్గు చూపారో మరి కొన్ని గంటల్లో బహిర్గతం కానుంది.

> ఎక్కడ చూసినా నరాలు తెగే ఉత్కంఠ. ఎవరి నాడి పట్టినా ఎన్నికల ఫలితాల చలి జ్వరం. విజయం ఎవరిని వరించనుందోనన్న ఉబలాటం. వెరసి ఎవరి నోట విన్నా.. కౌన్ బనేగా చేవెళ్ల అసెంబ్లీ బాద్ షా అనే.. ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఈ చర్చకు ముగింపు.. మరో కొద్ది గంటల్లో వెలువడే ఎన్నికల ఫలితాలే పలుకనున్నాయి.

ఎవరిధీమా వారిదే

నేడు ఓట్ల లెక్కింపు నేపథ్యంలో అభ్యర్థులు ఎవరికి వారే గెలుపు ధీమాతో ఉన్నారు. నియోజకవర్గాన్ని ఎస్సీకి కేటాయించిన తరువాత జరిగిన ఎన్నికలతో ఇది నాలుగొవది అని చెప్పవచ్చు. ఇప్పటి వరకు టీడీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను ఒక్కోసారి గెలుపు వరించంగా.. ఈ సారి ఏ పార్టీ నెగ్గుకొస్తుందో చూడాలి. ఈ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై మా జెండాయే ఎగురుతుందని కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్ భరోసాతో ఉన్నారు. ఇక అధికార పార్టీ అభ్యర్థి కాలె యాదయ్య.. ఇంత కాలం బీఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాలే తనను గెలిపిస్తాయన్న ధీమాతో ఉన్నారు. బీజేపీ అభ్యర్థి కెఎస్. రత్నం.. 'నేను సుపరిచితుడినని, ప్రజలు తనవైపే ఉన్నారని' చెబుతున్నారు. ఏది ఏమైనా మరి కొన్ని గంటల్లో ప్రజలు ఎవరికి పట్టంకట్టారో, ఎవరిని ఇంటికి పంపిస్తారో తేలనుంది.

బీఆర్ఎస్‌లో సందిగ్ధం

షాబాద్: చేవెళ్ల నియోజకవర్గ ప్రజలు తమ ఓటు హక్కును చక్కగా వినియోగించుకున్నారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీతో పాటు 5 మండలాలలో కలిసి 74.18 శాతం పోలింగ్ నమోదు అయింది. నియోజకవర్గంలో మొత్తం 2,62,005 ఓట్లు ఉండగా.. 1,93,408 (పురుషులు 99,186, మహిళలు 94,222) మంది తమ ఓటును వినియోగించుకోగా.. ఇతరులు నలుగురు ఉన్నా.. ఎవరూ ఓటు వేయలేదు.

కాంగ్రెస్ జోరు..

అధికార బీఆర్ఎస్‌ను ఎగ్జిట్ పోల్స్ సందిగ్ధంలో పడేశాయి. మొదటి నుంచి ఎమ్మెల్యే కాలె యాదయ్యకు ప్రజల్లో వ్యతిరేకత ఉన్నప్పటికీ.. కేసీఆర్‌పై ఉన్న అభిమానంతో తమకు ఘన విజయాన్ని కట్టబెడతారని నాయకులు నమ్మారు. కానీ క్షేత్రస్థాయిలో ఈ సారి కాంగ్రెస్ తన జోరును ప్రదర్శించడం, ఓటింగ్ శాతం ఆ పార్టీకి మెరుగ్గా ఉండటంతో గులాబీ వర్గాల్లో పలు అనుమానాలు రేకెత్తాయి.

చాప కింద నీరులా కమలం

బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన కెఎస్ రత్నంకు.. నవాబుపేట్, శంకర్‌పల్లి, చేవెళ్ల, మొయినాబాద్, షాబాద్ తదితర మండలాల్లో ప్రదారణ లభించింది. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ధీటుగా ఓట్లు పోలయ్యాయి. ముఖ్యంగా యువత భారీగా మొగ్గుచూపింది. దీంతో రత్నం గెలుస్తాడన్న ప్రచారమూ జరుగుతోంది.

కల్వకుర్తి కింగ్ ఎవరో?

- అభ్యర్థుల భవితవ్యం తేలేది నేడే
- సీవీఆర్ కళాశాలలో ఓట్ల లెక్కింపు


కసిరెడ్డి నారాయణ రెడ్డి, కాంగ్రెస్


జైపాల్‌యాదవ్, బీఆర్ఎస్


ఆచారి, బీజేపీ

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో విజయం ఎవరిని వరిస్తుందోనని అభ్యర్థులతో పాటు ప్రజలు కుతూహలంగా ఉన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినప్పటికీ.. గెలుపుపై సర్వత్రా చర్చ జరుగుతోంది. తమదే పైచేయి అంటూ ప్రధాన పార్టీల అభ్యర్థులు, వారి అనుచరులు ధీమా వ్యక్తంచేస్తున్నారు. అసెంబ్లీ పోటీలో మొత్తం 24 మంది ఉన్నారు. అందులో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ అభ్యర్థిగా కసిరెడ్డి నారాయణరెడ్డి, బీజేపీ నుంచి ఆచారి, బీఆర్ఎస్ నుంచి జైపాల్‌యాదవ్‌లు ఉన్నారు. సెగ్మెంట్‌లో 2,41,762 మంది ఓటర్లు ఉండగా.. 2,01,285 ఓట్లు పోలయి.. 83.26 శాతం పోలింగ్ నమోదైంది. ఇక్కడ ఊహించిన దానికంటే ఎక్కువ శాతం పోలింగ్ కావడంతో ఏ అభ్యర్థికి అనుకూలంగా ఉంటుందోనన్న చర్చ జరుగుతోంది. పోలింగ్ సరళిని బట్టి ప్రధాన పార్టీల వారు.. ఎవరికి వారే లెక్కలు వేసుకుంటున్నారు.

ఇద్దరి మధ్యే పోటీ

జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోటీ రసవత్తరంగా ఉందని, వీరిలో ఎవరు గెలిచినా మెజార్టీ మాత్రం తక్కువ గానే ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలతో హస్తం నేతలు ప్రజల్లోకి వెళ్లగా.. మంచి స్పందన లభించిందని, దీనికి తోడు వివాద రహితుడైన కసిరెడ్డి నారాయణరెడ్డి వైపు ప్రజలు మొగ్గుచూపుతున్నారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బీజేపీ అభ్యర్థి ఆచారి.. ఇప్పటికి ఐదుసార్లు ఓడిపోయి, ఆరోసారి బరిలో నిలిచారు. తనకు ఒక సారి అవకాశం ఇవ్వాలని ఆయన ప్రచారం చేశారని, అందుకు ప్రజల నుంచి తగిన స్పందన వచ్చిందని కాషాయ వర్గాలు చెప్పాయి. ఇక ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ అభ్యర్థి జైపాల్ యాదవ్‌ను గెలిపిస్తాయని గులాబీ తమ్ముళ్లు స్పష్టం చేస్తున్నారు. ఇలా ఎవరికి వారే గెలుపోటములను చర్చించుకుంటూ.. బెట్టింగులకు పాల్పడినట్లు సమాచారం. ఏది ఏమైనా నేడు జిల్లా పరిధిలోని మంగళపల్లి సమీపాన సీవీఆర్ కళాశాలలో నిర్వహించే లెక్కింపు అనంతరం వెలువడే ఫలితాలే విజేతెవరే? పరాజితులెవరో తేలుస్తాయి.

జలమండలికి పీఆర్ఎస్ఐ నేషనల్ అవార్డు



సాక్షి,సిటీబ్యూరో: జలమండలికి మరో పురస్కారం లభించింది. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ) నేషనల్ అవార్డు – 2023ను జలమండలి దక్కించుకుంది. పీఆర్ఎస్ఐ నిర్వహించిన ఇంటర్నేషనల్ పబ్లిక్ రిలేషన్స్ ఫెస్టివల్ – 2023 లో 'కాఫీ టేబుల్ బుక్' కేటగిరీలో రెండో బహుమతి లభించింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ (ఐఐఎం), ఇతర మల్టీనేషనల్ కంపెనీలతో పోటీ పడి ఈ అవార్డును దక్కించుకుంది. ఇటీవల ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేశారు. శనివారం జలమండలి ప్రధాన కార్యాలయంలో పీఆర్వో సుభాష్, ఓఎస్డీ పీఆర్వో మనోహరాచారి ఎండీకి పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన వారిని అభినందించారు.

గతేడాది రెండు పీఆర్ఎస్ఐ అవార్డులు

పీఆర్ఎస్ఐ గతంలో నిర్వహించిన పలు పోటీల్లో జలమండలికి రెండు అవార్డులు దక్కాయి. వివిధ కేటగిరీల్లో నిర్వహించిన పోటీల్లో.. ఉత్తమ కమ్యునికేషన్ క్యాంపెయిన్, ప్రజా అవగాహన విభాగాల్లో జలమండలి మొదటి, మూడో బహుమతి దక్కించుకుంది. జలమండలి పీఆర్ఎస్ నేషనల్ అవార్డు గెలుచుకోవడం వరుసగా ఇది నాలుగోసారి కావడం విశేషం. కాగా జలమండలి ఈ ఏడాది ఇప్పటికే 4 అవార్డులు గెలుచుకుంది. మార్చి 18 న వరల్డ్ వాటర్, మే 1 న ఉత్తమ యాజమాన్య, జులై 5 న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ), ఆగస్టు 1 న గ్లోబల్ ఇన్నోవేషన్ ఇన్ వాటర్ టెక్నాలజీ – 2023 అవార్డులు వచ్చాయి. తాజా అవార్డుతో మొత్తం జలమండలి ఈ ఏడాది 5 పురస్కారాలను తన ఖాతాలో వేసుకుంది. కార్యక్రమంలో ఫిల్మ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ మాజీ పీఆర్వో మధుసూదన్ పాల్గొన్నారు.

బాలిక ఆత్మహత్య


కావేరి మృతదేహం

అత్తాపూర్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ బాలిక ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఎస్సై నిమ్మల వెంకన్న కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శివరాంపల్లి వీకర్‌సెక్షన్ కాలనీకి చెందిన వెంకటేశ్ కుమార్తె కావేరి (13) శివరాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. కాగా ఆమె గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ స్కూల్‌కు సరిగ్గా హాజరు కావడం లేదు. శనివారం ఇంట్లో ఒంటరిగా ఉన్న కావేరి ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.